శుక్రవారం
17 ఏప్రిల్ 2026
సంపుటి: 18 సంచిక:91
పేజీలు : 04, వెల రూ. 2రూ/
ఎడిటర్ : మజ్జి శివ కుమార్..

Published by:Vizianagaram, Visakhapatnam, Srikakulam, Parvathipuram manyam, Anakapalli, Kurnool, Alluri, Guntur, Vijayawada, East & West Godavari, Tirupathi, Hyderabad

www.prajaswamyamtelugudaily.com

స్థాపితం : 2008

RNI No. APTEL/2008/24928Postal
Registration No.: VZM/22/2020-2022
Period of Renewal

# ప్రజాస్వామ్యం

తెలుగు దినపత్రిక

PRAJASWAMYAM TELUGU DAILY (ANDHRA & TELANGANA)

## పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీ వేగవంతం చేయాలి


3 లో

### జనగణన ప్రక్రియలో

## భాగస్వాములు కావాలి

-- సీఎం చంద్రబాబు పిలుపు

-- స్వీయ జనగణనలో వివరాలు నమోదు చేసుకున్న సీఎం



అమరావతి : జనగణన కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో గురువారం ప్రారంభమైన స్వీయ జనగణన కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి తన వివరాలను ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా నమోదు చేసుకున్నారు. హౌస్ లిస్టింగ్ -- హౌస్ సెన్సెస్ కార్యక్రమంలో భాగంగా ఆన్‌లైన్ ద్వారా వివరాల నమోదు ప్రక్రియ ప్రారంభమైంది. వెబ్‌సైట్‌లో ఆయన తన వివరాలను నమోదు చేశారు. మొత్తం 33 ప్రశ్నలతో కూడిన ఈ సెల్ఫ్ ఎన్యుమరేషన్ ప్రక్రియను జనగణన డైరెక్టర్ జె.నివాస్ సిఎంకు వివరించారు. ఈ నెల 30వ తేదీ వరకు ప్రజలు స్వయంగా ఆన్‌లైన్‌లో తమ ఇళ్లకు సంబంధించిన వివరాలు నమోదు చేసుకునే అవకాశం కల్పించినట్లు తెలిపారు. మే 1 నుంచి 30వ తేదీ వరకు ఎన్యుమరేటర్ అధికారులు ఇంటింటికీ వెళ్లి భౌతికంగా ఇళ్ల గణన ప్రక్రియ చేపడతారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి

వివరాలు2లో..

### దేశ చరిత్రలో

# కీలక ఘట్టం

**ఏపీలో 38, తెలంగాణలో 26 లోక్‌సభ స్థానాలు**


**దక్షిణాదిలో స్థానాలు 129 నుంచి 195కి పెంపు**

**డీలిమిటేషన్‌తో అన్ని రాష్ట్రాలకూ సమన్యాయం**

**దక్షిణాదికి అన్యాయమనే విపక్షాల ఆరోపణలు అవాస్తవం:**

న్యూఢిల్లీ, : నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేష న్)తో ఏ రాష్ట్రానికీ అన్యాయం జరగదని, దక్షిణాదికి అన్యాయం జరుగుతుందనే విపక్షాల వాదన అవాస్తవమ ని ప్రధాని మోదీ కొట్టిపడేశారు. కేంద్ర ప్రభుత్వానికి దక్షిణాది, ఉత్తరాది అనే భేదం లేదని, అన్ని రాష్ట్రాలకూ సమ న్యాయం జరగాలన్నదే తమ అకాంక్ష అని పేర్కొన్నారు.డీలిమిటేషన్ ద్వారా తూర్పు నుంచి పడమర వరకు.. ఉత్తరం నుంచి దక్షిణం వరకు.. అన్ని రాష్ట్రాలకూ సమ న్యాయం జరుగుతుందని హామీ ఇచ్చారు. లోక్‌సభలో కేంద్ర మంత్రులు అర్జు న్ రామ్, అమిత్‌షా మూడు కీలక బిల్లులు ప్రవేశపెట్టిన

వివరాలు2లో..




### మంత్రాలయం సమీపంలో

# ఘోర రోడ్డు ప్రమాదం

-- 8 మంది యాత్రికుల దుర్మరణం

-రాఘవేంద్రస్వామి దర్శనానికి కర్ణాటక యాత్రికులు వెళ్తుండగా ఘటన


2 లో

# ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకులు సాధించాలి

### వైద్య కళాశాలలకు మంత్రి సత్యకుమార్ పిలుపు

అమరావతి : ప్రభుత్వ వైద్య కళాశాలలు నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ (ఎన్ఐఆర్ఎఫ్) ర్యాంకులను సాధించేందుకు కషి చేయాలని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పిలుపునిచ్చారు. ఈ ర్యాంకులు సాధించడం ద్వారా కళాశాలలకు ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని ఆయన పేర్కొన్నారు. విజయవాడలోని ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయంలో రూ.6 కోట్ల వ్యయంతో ఏర్పాటు కానున్న డిసీజ్ మానిటరింగ్ అండ్ డెసిషన్ మేకింగ్ సెంటర్ (డిఎండిసి)ను గురువారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంతర్జాతీయ స్థాయి

వివరాలు2లో..




### డీలిమిటేషన్, సవరణ

## బిల్లులపై ప్రతిపక్షాల నిరసన..

### లోక్‌సభలో తీవ్ర వాగ్వాదం



న్యూఢిల్లీ, : లోక్‌సభలో గురువారం నాడు తీవ్ర ఉద్రిక్తతలతో కూడిన రాజకీయ ఘర్షణ చెలరేగింది. కాంగ్రెస్ ఎంపీ కే.సీ వేణుగోపాల్‘ రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు-2026’, ‘కేంద్ర పాలిత ప్రాంతాల చట్టాల (సవరణ) బిల్లు-2026’, ‘డీలిమిటేషన్ బిల్లు-2026’ల ప్రవేశాన్ని వ్యతిరేకించడంతో ప్రతిపక్షాలు, అధికార పక్షాల మధ్య తీవ్ర వాగ్వాదాలు చోటుచేసు కున్నాయి. పార్లమెంటు దిగువ సభను ఉద్దేశించి ప్రసంగిస్తూ, వేణుగోపాల్ ఇలా అన్నారు. “కేంద్ర మంత్రులు అర్జున్ రామ్ మేఘ్వాల్, అమిత్ షా ప్రవేశపెట్టిన బిల్లును నేను వ్యతిరేకిస్తున్నాను. ఈ బిల్లు భారత సమాఖ్య వ్యవస్థపై ఒక మౌలిక దాడి. అసలు ఈ బిల్లు ఉద్దేశ్యం

వివరాలు2లో..

# ఎస్ఎంసిలకు పాఠశాలల్లో పనులు

అమరావతి : ప్రభుత్వ పాఠశాలల్లో కనీస మౌలిక సదుపాయాల పనులను స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల (ఎస్ఎంసిల) ద్వారా వేగంగా పూర్తి చేయాలని అధికారులను విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆదేశించారు. పాఠశాల విద్య, ఇంటర్మీడియట్ విద్య శాఖల ఉన్నతాధికారులతో గురువారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అన్ని ప్రభుత్వ పాఠశాలలను కనీసం 3-స్టార్ మౌలిక సదుపాయాలతో అభివృద్ధి చేయాలని, వెయ్యిమందికి పైగా విద్యార్థులున్న 60 పాఠశాలలను 5-స్టార్ స్థాయికి తీసుకెళ్లేలా చర్యలు చేపట్టాలని సూచించారు. లీక్ ప్రూఫ్ భవనాలు, తాగునీరు, మరుగుదొడ్లు, పెయింటింగ్, బల్లల ఏర్పాటు వంటి పనులను ఎస్ఎంసిలకు అప్పగించాలన్నారు. అయితే మోడల్ ప్రైమరీ పాఠశాలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణానికి అవసరమైన రూ.143.27 కోట్ల పనులను రాష్ట్ర పాఠశాల మౌలిక సదుపాయాల సంస్థ ద్వారా చేపట్టాలని స్పష్టం చేశారు. ఏజెన్సీ, మారుమూల ప్రాంతాల్లో సొంత భవనాలు లేని పాఠశాలలను గుర్తించి వెంటనే నిర్మాణాలు ప్రారంభించాలని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెంచేందుకు ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని, ఈసారి కనీసం 10 శాతం ప్రవేశాలు పెంచే లక్ష్యంతో పనిచేయాలని పేర్కొన్నారు. డ్రాపౌట్ రేటును జీరో స్థాయికి తీసుకురావాలని, బడి ఈడు పిల్లలు బడి బయట ఉండకూడదని అన్నారు. ఇంటర్మీడియట్ స్థాయిలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులు ప్రైవేటు సంస్థలకు దీటుగా అత్యుత్తమ మార్కులు సాధించడం అభినందనీయమన్నారు.



అలాంటి విద్యార్థులను గుర్తించి విస్తృత ప్రచారం చేయడంతోపాటు ‘షైనింగ్ స్టార్స్’ కార్యక్రమంలో సత్కరించాలని అధికారులకు సూచించారు. కళాశాలల్లో ముఖ ఆధారిత హాజరు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో మానవ వనరులశాఖ కార్యదర్శి కోన శశిధర్, ఇంటర్మీడియట్ విద్య డైరెక్టర్ రంజిత్ బాషా, పాఠశాల విద్య డైరెక్టర్ తమీమ్ అన్సారియా, పాఠశాల మౌలిక సదుపాయాల సంస్థ ఎమ్‌డి దీవన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ఏపీలో పలువురు

## మున్సిపల్ కమిషనర్ల బదిలీ

అమరావతి: ఏపీలో పలువురు మున్సిపల్ కమిషనర్లను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం విజయవాడ మున్సిపల్ కమిషనరేట్‌లో జోనల్ కమిషనర్‌గా ఉన్న రమ్య కీర్తనను నరసరావుపేట మున్సిపల్ కమిషనర్‌గా నియమించింది. దర్శి మున్సిపల్ కమిషనర్‌గా అర్జునరావు, పులివెందుల మున్సిపల్ కమిషనర్‌గా మునికుమార్, ఉయ్యూరు మున్సిపల్ కమిషనర్‌గా సుభాష్ చంద్రబోస్, తెనాలి మున్సిపాలిటీ అసిస్టెంట్ కమిషనర్‌గా రామారావు, గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ సౌత్ జోనల్ కమిషనర్‌గా ప్రసాదరావు, గుంటూరు మున్సిపాలిటీ అడిషనల్ కమిషనర్‌గా మల్లయ్య నాయుడు నియమితులయ్యారు. ఈ బదిలీలు తక్షణమే అమల్లోకి వస్తాయని ఏప్రీ ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి సురేశ్‌కుమార్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

### పంచాయతీ

## ఎన్నికల ఓటర్ల జాబితా రెడీ


2 లో

# వృద్ధిపై దృష్టి పెట్టండి

**అధికారులకు ముఖ్యమంత్రి ఆదేశం-ముగిసిన ఏడాది ఆదాయ వ్యయాలపై చర్చ**



అమరావతి : వివిధ శాఖల్లో వృద్ధిపై అధికారులు దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ఆర్థికశాఖపై గురువారం ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముగిసిన ఆర్థిక సంవత్సరంలో ఆదాయ వ్యయాలు, జిఎస్‌పి వృద్ధి వంటి అంశాలపై సమీక్షించారు. ప్రధానంగా మూడు కీలక రంగాల్లో వృద్ధిని మరింతగా సాధించేందుకు తద్వారా స్థూల రాష్ట్ర ఉత్పత్తిని పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేశారు. కొత్త సంవత్సరంలో పథకాలకు నిధుల ఇబ్బందులు రాకుండా చూసుకోవాలన్నారు.రాష్ట్ర స్థూల ఉత్పత్తి లక్ష్యాలను సాధించేందుకు లక్ష్యాలను, ప్రణాళికలను నిర్దేశించుకోవాలని సిఎం సూచించారు. అలాగే స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక ప్రణాళికల

వివరాలు2లో..

# తెలుగు రాష్ట్రాల్లో భానుడి భగభగలు..



**రానున్న మూడురోజులు ఎండలు మండిపోతాయి**

విశాఖపట్నం, : తెలుగు రాష్ట్రాల్లో ఎండలు దంచికొడు తు న్నాయి. ఉదయం 8 గంటల నుంచే భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తు న్నాడు. దీంతో జనాలు ఉక్కపోతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 43 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదై జనాలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. రానున్న మూడు రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఈ మూడు రోజుల పాటు పలు జిల్లాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ముఖ్యంగా ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, మహబూబ్ నగర్‌తో పాటు ఖమ్మం, మెదక్, మేడ్చల్, హైదరాబాద్ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. రానున్న మూడు రోజులు ఆయా జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 41 నుంచి 44 డిగ్రీలు నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది. ఎండలు ముదురుతున్న నేపథ్యంలో జనాలు జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచించారు..ఇక ఏపీలో రానున్న మూడు రోజులు ఎండల

వివరాలు2లో..

# దేశ చరిత్రలో కీలక ఘట్టం

మొదటి పేజి తరువాయి

తర్వాత ప్రధాని మోదీ ఆ బిల్లులనుద్దేశించి మాట్లాడారు. మహిళా రిజర్వేష న్లను రాజకీయ కోణంలో చూడొద్దని రాజకీ య పార్టీలకు పిలుపునిచ్చారు. మహిళా రిజర్వేషన్లను తీసుకురావడంలో తమకు ఎలాంటి రాజకీయ దురుద్దేశం లేదని వెల్లడించారుమహిళా కోటా బిల్లును వ్యతిరేకించే రాజకీయ పార్టీలన్నీ భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించుకుంటాయని హెచ్చరించారు. ఒక చారిత్రక బిల్లు ప్రవేశపెట్టే సమయంలో సభలో తాను ఉండటం తన అదృష్టమంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. వికసిత్ భారత్ అంటే రోడ్లు, రైళ్లు, మౌలిక సదుపాయాలే కాదని, మహిళల సాధికారత, వారికి చట్టసభల్లో ప్రాతినిధ్యం పెంపు కూడా అని పేర్కొన్నారు. వికసిత్ భారత్ సాధనలో మహిళల పాత్ర కీలకమని, వారికి అవకాశమిస్తే దేశాన్ని సరికొత్త మార్గంలో నడిపిస్తారని కొనియాడారు. రాజకీయాల్లో తమ శక్తిని చాటేందుకు మహిళలు సిద్ధంగా ఉన్నారని, ఎవరికైనా అవకాశమిస్తేనే వారి సామర్థ్యం తెలుస్తుందంటూ చమత్కరించారు. చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ల కల్పన అనేది మహిళలకు ఇచ్చే కానుక కాదని, అది వారి హక్కు అంటూ అభివర్ణించారు. మహిళా రిజర్వేషన్ల సాధన కోసం 30 ఏళ్ల నుంచి ప్రయత్నాలు జరుగుతున్నాయని, తాము అధికారంలోకి వచ్చిన తర్వాత 2024 ఎన్నికల్లో అమలు చేసేందుకు ప్రయత్నించామని, అయి న సాధ్యం కాలేదని గుర్తుచేసుకున్నారు. 2029 సార్వత్రిక ఎన్నికల్లోనూ మహిళా కోటా సాధ్యం కాకపోతే, ఇక మహిళలకు అన్యాయం జరిగినట్లేనని పేర్కొన్నారు. మద్దతిచ్చే పార్టీలకే మనుగడ.. మహిళా రిజర్వేషన్లను వ్యతిరేకించే వారిని, మహిళలు క్షమించరని హెచ్చరించారు. రాజకీయ నేతలకు కచ్చితంగా బుద్ధి చెబుతారని చెప్పుకొచ్చారు. మహిళా బిల్లులకు మద్దతిచ్చే పార్టీలకే మనుగడ ఉంటుందని జోస్యం చెప్పా రు. డీలిమిటేషన్ వల్ల దక్షిణాదికి ఎలాంటి నష్టం లేదని ఉద్ఘాటించారు. ఈ బిల్లు తీసుకురాగానే కొందరు విభజన రాజకీయాలు చేస్తున్నారని పరోక్షంగా తమిళనాడు, తెలంగాణ ముఖ్యమంత్రులు స్టాలిన్, రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి వ్యాఖ్యలు చేశారు. చిన్న రాష్ట్రం, పెద్ద రాష్ట్రం, ఉత్తరాది, దక్షిణాది అనే.. భేదభావమే తమకు లేదని తేల్చిచెప్పారు. బిల్లుల ద్వారా వచ్చే క్రెడిట్ తమకు వద్దని, విపక్షాలే తీసుకోవాలని, కానీ, మహిళా కోటా బిల్లును మాత్రం అడ్డుకోవద్దని విజ్ఞప్తి చేశారులోక్‌సభలో మహిళల సీట్లు 272భారత ప్రజాస్వామ్య చరిత్రలో ఇదొక చారిత్రాత్మక ఘట్టం. మహిళా శక్తికి ప్రాధాన్యం ఇవ్వడమే మా లక్ష్యం. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కలలు కన్న మహిళా హక్కుల సాకారం కాబోతున్నది. డీలిమిటేషన్ ప్రక్రియ తర్వాత లోక్‌సభలో 815 సీట్లు పెరుగుతాయి. వాటిలో 272 సీట్లు మహిళలకు దక్కుతాయి. తద్వారా మహిళలకు సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో ప్రాతినిధ్యం లభిస్తుంది. దయచేసి మహిళా కోటా బిల్లుపై రాజకీయం చేయొద్దు. అన్ని పార్టీలూ బిల్లులకు మద్దతు పలకాలి. అర్జున్ రామ్ మేఘవాల్, కేంద్ర న్యాయ శాఖ మంత్రిఓబీసీ మహిళలకు లాభమేంటి?మహిళలకు రిజర్వేషన్లు ఇవ్వాలనీ మేమూ కోరుకుంటున్నాం. కానీ, కేంద్రం ప్రవేశపెట్టిన బిల్లుల వెనుక భారీ కుట్ర దాగి ఉంది. జన గణన చేయకుండానే సీట్ల సంఖ్యను పెంచాలని ఎవరు నిర్ణయించారు? కుల గణ న జరగకుండా వెనుకబడిన తరగతుల (ఓబీసీ) మహిళలకు న్యాయం ఎలా జరుగుతుంది? మహిళా కోటా బిల్లుతో ఓబీసీ మహిళల భాగస్వా మ్యమెంత? కేవలం ఎన్నికల్లో లబ్ధిపొందడానికే బిల్లులు. బీజేపీ దేశవ్యాప్తంగా 21 రాష్ట్రాల్లో ధికారం లో ఉంది. ఆ పార్టీ నుంచి ఎంతమంది మహిళా ముఖ్యమంత్రులు ఉన్నారు? ఎంత మంది మహిళా మంత్రులు ఉన్నారు? ముందు ఆ విషయం తేల్చండి. తర్వాత మహిళా కోటా బిల్లు సంగతిఅఖిలేష్‌యాదవ్,"బిల్లు మహిళా రిజర్వేషన్ కోసం తెచ్చిందే కాదు, దీని వెనుక కుట్ర ఉంది. దొడ్డిదారిన డీలిమిటేషన్ తీసుకురావడానికి కేంద్రం పన్నిన వ్యూహమిది. జనగణన లేకుండా కేంద్రం లోక్ సభ సీట్లను ఎలా 815కు పెంచుతుంది. ప్రస్తుతం ఉన్న 543 సీట్లలోనే మహిళలకు ప్రాతినిధ్యం ఇవ్వొచ్చు కదా. మహిళలకు రిజర్వేషన్లు ఇవ్వడానికి కేంద్రానికి ఉన్న అభ్యంతరమేంటి? మీరు మహిళా రిజర్వేషన్‌ను డీలిమిటేషన్‌తో ముడిపెట్టి అడ్డంకులు సృష్టిస్తు న్నారు. ఇది సమాఖ్య స్ఫూర్తిపై చేస్తున్న దాడి. అస్సాం, జమ్మూ కాశ్మీర్ లో చేసినట్లుగానే దేశవ్యాప్తం గా నియోజకవర్గాల సరిహద్దులను ఇష్టానుసారం మార్చేయాలనేది కేంద్రం ఉద్దేశం.

## తెలుగు రాష్ట్రాల్లో భానుడి భగభగలు..

మొదటి పేజి తరువాయి

తీవ్రత మరింత పెరిగే అవకాశముందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులు హెచ్చరించారు. ముఖ్యంగా రాయలసీమ, కోస్తాంధ్ర జిల్లాల్లో వడగాలుల తీవ్రత జనజీవనాన్ని అస్తవ్యస్తం చేస్తోంది. శ్రీకాకుళం నుంచి తిరుపతి వరకు దాదాపు 14 జిల్లాల్లో ఎండల ప్రభావం అధికంగా ఉండనుంది. ఇప్పటి వరకు కడప జిల్లా ఒంటిమిట్టలో 45డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రత నమోదైంది. రాష్ట్రంలోని 262 మండలాల్లో 40డిగ్రీల కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాష్ట్రంలో ఎండల తీవ్రతపై రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ కీలక ప్రకటన చేశారు. గురువారం 101 మండలాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులు హెచ్చరించారు. ఎండల తీవ్రత పెరుగుతోందని, ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.

## వృద్ధిపై దృష్టి పెట్టండి

మొదటి పేజి తరువాయి

ద్వారా ఉత్పాదకత సాధించేందుకు ప్రయత్నించాలని నిర్దేశించారు. 15 శాతం వృద్ధి రేటును సాధించేందుకు క్షేత్రస్థాయి వరకు ప్రణాళికలు అమలు చేయాలన్నారు. రాష్ట్రంలో నీరు, విద్యుత్ వంటి వనరులను పరిశ్రమల స్థాపన, వ్యవసాయం సమకూరుస్తున్నామని, ఈ నేపథ్యంలోనే ఉత్పత్తి పెంచేలా చూడాల్సిన అవసరం ఉందని సూచించారు. ఆర్థికంగా ఇబ్బందులున్నా విద్యుత్ ఛార్జీలను పెంచలేదని, పైగా గత ప్రభుత్వ హయాంలో బకాయిలు రూ.4,600 కోట్లను కూడా ఇప్పుడు చెల్లిస్తున్నామని గుర్తు చేశారు. ఆదాయ లక్ష్యాలు సాధించాఆదాయార్జన శాఖలు తమకు నిర్దేశించిన ఆదాయ లక్ష్యాలను పూర్తిగా సాధించాలని సిఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఆయా శాఖల్లో గత ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించుకున్న లక్ష్యాలు, చివరకు వచ్చిన ఆదాయంపైనా అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే కేంద్రం నుంచి ఎంత రావాలి, ఎంత వచ్చిందన్నది కూడా ఆరా తీశారు.

## పంచాయతీ ఎన్నికల ఓటర్ల జాబితా రెడీ



అమరావతి, : ఏపీలో పంచాయతీ ఎన్నికలకు అధికారులు సిద్ధమయ్యారు. ఎన్నికలు ఎప్పుడు పెట్టిన తాము సిద్ధమేనని అంటున్నారు. దానికి తగ్గట్టు పంచాయతీ ఎన్నికల ఓటర్ల జాబితా విడుదల చేసారుమొత్తం రాష్ట్రంలో 2,89,01,402 మంది ఓటర్లు ఓటుహక్కు వినియోగించుకొనున్నారు. ఈ జాబితాలో పురుషులు 1,42,26,677, మహిళలు 1,46,73,412, ట్రాన్స్ జెండర్లు 1,313 మంది ఉన్నారు .మొత్తం 13,348 పంచాయతీలకు గానూ 13,259 పంచాయతీల ఓటర్ల జాబితాను పంచాయితీ రాజ్ శాఖ ప్రకటించింది. 17 జిల్లాల్లో ఓటర్ల జాబితా పూర్తవగా కోర్టు కేసులు, తదితర కారణాలతో 11 జిల్లాల్లోని 89 పంచాయతీ జాబితాలు పూర్తి కాలేదు. కోర్ట్ కేసులు తెలితే ఆయా జిల్లాల ఓటర్ల జాబితాను విడుదల చేస్తారు.

## ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకులు సాధించాలి

మొదటి పేజి తరువాయి

జర్నల్స్, ముఖ్యంగా లాన్సెట్ వంటి పత్రికల్లో రాష్ట్ర వైద్యుల పరిశోధన పత్రాలు ప్రచురితమయ్యేలా కషి చేయాలని సూచించారు. బోధనాసుపత్రుల అభివద్ధికి సుమారు రూ.4 వేల కోట్లకు పరిపాలనా ఆమోదం వచ్చినప్పటికీ, పనుల్లో వేగం కనిపించడంలేదనిమంత్రి అసంతప్తి వ్యక్తం చేశారు. సూపరింటెండెంట్లు, ప్రిన్సిపాళ్లు సమన్వయంతో పని చేసి అభివద్ధి పనులను ముందుకు తీసుకెళ్లాలని ఆదేశించారు. పూర్వ విద్యార్థుల సహకారాన్ని కూడా ప్రణాళికాబద్ధంగా వినియోగించుకోవాలని సూచించారు. వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్ మాట్లాడుతూ.. వైద్య కళాశాలల్లో ఆత్మహత్యలు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపాళ్లకు సూచించారు. సుమారు 7 వేల మంది బోధకులు ఉండటంతో ప్రతి ఒక్కరు 10 నుంచి 20 మంది విద్యార్థులను పర్యవేక్షించి, వారికి కౌన్సెలింగ్ అందించాలని అన్నారు. ముఖ్యంగా ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం విద్యార్థుల కోసం ప్రత్యేక మానసిక ఆరోగ్య శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. కొత్త కోర్సులకు ప్రణాళిక రూపొందించినట్లు వెల్లడించారు. బీఎస్సీ ఫ్యామిలీ ఎమర్జెన్సీ మెడిసిన్, ఫోరెన్సిక్ నర్సింగ్ కోర్సులను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. బయోఫిజిక్స్ కోర్సులను ఐఐటీ చెన్నై, ఐఐటీ ఢిల్లీ సహకారంతో ప్రవేశపెట్టే ఆలోచనలో ఉన్నామని తెలిపారు.

## భవన నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమానికి కృషి



ప్రజాస్వామ్యం/పార్వతీపురం, ఏప్రిల్ 16: జిల్లాలోని భవన నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని కలెక్టర్ డా ఎన్ ప్రభాకర రెడ్డి తెలిపారు. కార్మి కుల బీమా పథకంలో నమోదైన వారికి వివాహ కానుక పథకం కింద రూ.20 వేలు, ప్రసూతి ప్రయోజనంగా రూ.20 వేలు, సహజ మరణానికి రూ.60 వేలు, అంత్యక్రియలకు రూ.20 వేలు ఆర్థికసాయం అందజేస్తున్నట్లు చెప్పారు. 18-60 ఏళ్లలోపు వయసున్న కార్మికులు బీమా పథకానికి అర్హులన్నారు. వీరంతా సమీప సహాయ కార్మిక శాఖాధికారి కార్యాలయంలో పేర్లు నమోదు చేయించు కోవచ్చన్నారు. ఈ సందర్భంగా కార్మిక సహాయ కమిషనర్ పి సువర్ణ జిల్లా కలెక్టర్ డా ఎన్ ప్రభాకర రెడ్డి గారి ఆదేశాలననుసరించి గురువారం తన కార్యాలయంలో భవన నిర్మాణకార్మిక సంఘాల నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ 2026 మార్చి ఒకటో తేదీ నుంచి సంభవించిన సంఘటనలు, అర్హత గల ఘటనలపై క్లెయిమ్, దరఖాస్తులను సహాయ కార్మిక శాఖ అధికారులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో భవన నిర్మాణ కార్మిక సంఘ నాయకులు రెడ్డి వెంకటరమణమూర్తి, తాడ్డి శ్రీనివాసరావు, బెవర శేషగిరిరావు, ఏ. వెంకటరమణ, రెడ్డి జగదీష్ కుమార్, ఏ. దుర్గారావు, బి. సూరిబాబు, ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

## జనగణన ప్రక్రియలో భాగస్వాములు కావాలి

మొదటి పేజి తరువాయి

చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, రాష్ట్రంలోని ప్రతి పౌరునికి సమానంగా సంక్షేమం, అభివద్ధి ఫలాలు అందించాలన్న సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. కుటుంబాన్ని యూనిట్‌గా తీసుకుని అభివద్ధి ప్రణాళికలు రూపొందించేందుకు జనగణన కార్యక్రమం కీలకమన్నారు. రాష్ట్ర విభజన తర్వాత తొలి సారిగా జనగణన జరుగుతోందని, ఇది కేవలం సమాచార సేకరణ మాత్రమే కాకుండా అభివద్ధికి బలమైన పునాది వేస్తుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. జనగణన కార్యక్రమం రెండు దశల్లో జరుగుతుందని, మొదటి దశలో గృహ గణన (హౌస్ లిస్టింగ్) గురువారం ప్రారంభమైందన్నారు. వచ్చే ఏడాది ప్రారంభమయ్యే రెండో దశలో జనాభా లెక్కల సేకరణ జరుగుతుందని తెలిపారు. ప్రస్తుతం ప్రారంభమైన హౌస్ లిస్టింగ్ కార్యక్రమంలో ప్రజలు స్వయంగా ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకునే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సరైన వివరాలు నమోదు చేయడం ద్వారా రాష్ట్ర అభివద్ధికి సహకరించాలని ప్రజలకు ముఖ్యమంత్రి సూచించారుకందుకూరికి ఘన నివాళిసంఘ సంస్కర్త, బహుముఖ ప్రజ్ఞాశాలి, తెలుగు జాతికి నవయుగ వైతాళికుడు కందుకూరి వీరేశలింగం పంతులు 178వ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆయనకు ఘన నివాళి అర్పించారు. స్త్రీ విద్య కోసం నిరంతరం పోరాడిన మహనీయుడని సామాజిక మాధ్యమం అయిన బాల్య వివాహాలను ఖండించి, వితంతు వివాహాలను ప్రోత్సహించిన ధైర్యవంతుడని పేర్కొన్నారు. సమాజంలో మార్పు కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహోన్నత వ్యక్తిత్వం కందుకూరిదన్నారు. ఈ సందర్భంగా ఆయన సేవలను స్మరించుకున్నారు.

### డీలిమిటేషన్, సవరణ
## బిల్లులపై ప్రతిపక్షాల నిరసన..



మొదటి పేజి తరువాయి

ఏమిటి? మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ పార్లమెంటు ఈ బిల్లును లోక్‌సభ, రాజ్యసభ రెండింటిలోనూ ఆమోదించింది." దీనికి కేంద్ర హోం మంత్రి అమిత్ షా వేగంగా, గట్టిగా స్పందిస్తూ, బిల్లులను ప్రవేశపెట్టే దశలో వేణుగోపాల్ వాటి యోగ్యతలను ప్రశ్నించలేరని, కేవలం సాంకేతిక అభ్యంతరాలు లేవనెత్తడానికి మాత్రమే పరిమితమయ్యారని స్పష్టం చేశారు. చర్చ సందర్భంగా ప్రతిపక్షాలకు ప్రభుత్వం గట్టి సమాధానం ఇస్తుందని అమిత్ షా పేర్కొన్నారులోక్‌సభలో రాజ్యాంగ (నూట ముప్పై ఒకటవ సవరణ) బిల్లు, 2026ను ప్రవేశపెట్టాలని న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ ప్రతిపాదించారు. లోక్‌సభలో కేంద్రపాలిత ప్రాంతాల చట్టాల (సవరణ) బిల్లు, 2026ను ప్రవేశపెట్టాలని హోంమంత్రి అమిత్ షా ప్రతిపాదించారు. లోక్‌సభలో డీలిమిటేషన్ బిల్లు, 2026ను ప్రవేశపెట్టాలని న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ ప్రతిపాదించారు. 'నారీ శక్తి వందన్ అధినియం' సవరణను ఆమోదించేందుకు ప్రభుత్వం ఏప్రిల్ 16, 17, 18 తేదీలలో పార్లమెంటు ప్రత్యేక సమావేశాలను ఏర్పాటు చేసింది. మహిళా రిజర్వేషన్ సవరణ బిల్లు, నియోజకవర్గాల పునర్విభజన బిల్లులను రెండింటినీ కలిపి ఆమోదించాలనే ఉద్దేశంతో, రూల్ 66లోని నిబంధనలను నిలిపివేస్తూ లోక్‌సభలో ఒక ప్రతిపాదనను ప్రవేశపెట్టడానికి కూడా న్యాయశాఖ మంత్రి సిద్ధమయ్యారు."లోక్‌సభ కార్యకలాపాల నియమావళిలోని 66వ నియమానికి ఉన్న మినహాయింపు నిబంధనను (జూతీశీజుఅంశీ) ఈ సభ తాత్కాలికంగా నిలిపివేయాలని" ఆ తీర్మానం పేర్కొంటోంది. 2026 నాటి 'డీలిమిటేషన్ బిల్లు', 'కేంద్ర పాలిత ప్రాంతాల చట్టాల (సవరణ) బిల్లు, 2026'లను పరిశీలించి ఆమోదించే ప్రక్రియకు సంబంధించి ఈ నిబంధన అమలును నిలిపివేయాలని కోరుతోంది. ఎందుకంటే ఈ బిల్లులు 'రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు, 2026'పై ఆధారపడి ఉన్నాయి. 2011 జనాభా లెక్కల ఆధారంగా, 2029 లోక్‌సభ ఎన్నికల నుండే మహిళా రిజర్వేషన్ల బిల్లును అమలులోకి తీసుకురావడానికి ఉద్దేశించిన సవరణ బిల్లును ఆమోదించే విషయంలో ప్రభుత్వం ప్రతిపక్షాల మద్దతును కోరుతోంది. 2029 సార్వత్రిక ఎన్నికల నుండే మహిళా రిజర్వేషన్లు అమలయ్యేలా చూడటానికి, ఈ సవరణకు మద్దతు ఇవ్వాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రతిపక్ష పార్టీలను కోరారు. "ఇది ఈ దేశంలోని ప్రతి సోదరి, ప్రతి కుమార్తె ఆకాంక్ష, మనం దీనిని ఏకగ్రీవంగా నెరవేర్చాలి," అని ఆయన మంగళవారం డెహ్రాడూన్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో అన్నారు.

## మంత్రాలయం సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం

కర్నూలు జిల్లా: కర్నూలు జిల్లా మంత్రాలయం మండల పరిధిలోని చిలకలడోణ గ్రామం సమీపంలో గురువారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. రాఘవేంద్రస్వామి దర్శనానికి వెళ్తుండగా చోటుచేసుకున్న ఈ ఘటనలో ఎనిమిది మంది యాత్రికులు ప్రాణాలు కోల్పోయారు. వీరిలో ఐదుగురు మహిళలు ఉన్నారు. 13 మందికి తీవ్ర గాయాలయ్యాయి. మృతులు, క్షతగాత్రులంతా కర్ణాటక రాష్ట్రానికి చెందినవారు. పోలీసులు, బాధితుల కథనం ప్రకారం... కర్ణాటక రాష్ట్రం చిక్కమంగళూరు జిల్లా తరికెరె తాలూకా ఉదయపుర గ్రామానికి చెందిన సుమారు 21 మంది మంత్రాలయం రాఘవేంద్రస్వామి దర్శనానికి బొలెరో వాహనంలో వస్తున్నారు. వీరి వాహనాన్ని మంత్రాలయం నుండి ఎమ్మిగనూరు వైపు వెళ్తున్న ఫ్లైయాష్ లారీ (రెడీ మిక్స్ ట్యాంకర్) బలంగా ఢకొెది. దీంతో, బొలెరో బోల్తా పడి ఆ వాహనంలోని ఐదుగురు అక్కడికక్కడే మృతి చెందారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరో ముగ్గురు మరణించారు. మృతుల్లో కుమార్ (60), దీపిక వీణ (35), సునీల్ (40), బెల్లి (3), పుట్టమ్మ (60), మీనాక్షి (50), తాయమ్మ అలియాస్ యశోద (60), లోలాక్షి (55) ఉన్నారు. తీవ్రంగా గాయపడిన మరో 13 మంది ప్రస్తుతం కర్నూలు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. సంఘటనా స్థలాన్ని కర్నూలు జిల్లా ఎస్పి విక్రాంత్ పాటిల్ సందర్శించారు. ప్రమాదానికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ ఘటన తనను తీవ్రంగా కలిచి వేసిందని చెప్పారు. బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. సిఐ ఎం.దస్తగిరిబాబు, ఎస్ఐ మల్లికార్జున తమ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు

## జనగణనకు పూర్తి సమాచారం అందజేసి సహకరించాలని కోరిన భీమిలి ఎమ్మెల్యే గంటా



భీమునిపట్నం, ప్రజాస్వామ్యం జనగణన కోసం వచ్చే ఎన్యూమరేటర్లకు పూర్తి సమాచారం అందజేసి సహకరించాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సూచించారు. భీమిలి ఆర్డీఓ కార్యాలయంలో స్వీయ గణన కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ ప్రజల గురించి సంపూర్ణ సమాచారముంటేనే ప్రభుత్వ పథకాలు వర్తింపజేయడం సులభతరమవుతుందని చెప్పారు. స్వీయ గణనలో మొబైల్ ద్వారా 33 ప్రశ్నలకు సమాధానమిచ్చాక కేటాయించే 11 నెంబర్ల ఐడీని మే 1 వ తేదీ నుంచి జనగణన కోసం వచ్చే ఎన్యూమరేటర్లకు తెలియజేస్తే... యాప్ లో సరి చూస్తారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు కూడా ఎన్యూమరేటర్లకు తగిన సమాచారమిచ్చి సహకారం అందించాలని.. వివరాలిస్తే పథకాలు ఆగిపోతాయన్న ప్రచారాన్ని నమ్మవద్దన్నారు. రాష్ట్రంలో 1.10 లక్షల మంది ఎన్యూమరేటర్లు పాల్గొంటున్న జనగణన విజయవంతానికి.. ప్రజాప్రతినిధులతో పాటు ఉద్యోగులు, విద్యార్థులు, స్వయం శక్తి సంఘాలు దన్నుగా నిలవాలని కోరారు. దేశ వ్యాప్తంగా జరుగుతున్న జనగణన ప్రపంచంలో అతి పెద్ద గణాంక కార్యక్రమంగా అభివర్ణించారు. అంతకుముందు రూ. 37.55 లక్షలతో భీమిలి జోన్ లోని 4 వార్డుల్లో ప్రతిపాదించిన డ్రెయిన్ల పూడికతీత పనులకు, రూ. 8.5 లక్షలతో ఏర్పాటు చేయనున్న చలివేంద్రాలకు గంటా శ్రీనివాసరావు శంకుస్థాపన చేశారు. జోనల్ కమిషనర్ ఎం..విజయ్ కుమార్, భీమిలి ఎమ్మార్వో పి. రామారావు, కూటమి నాయకులు చిక్కాల విజయ్ బాబు, గాడు వెంకటప్పడు, గంటా నూకరాజు, గాడు చిన్ని కుమారి లక్ష్మి, తమ్మిన సూరిబాబు, గొలగాని నరేంద్ర, సరగడ అప్పారావు, కనకల అప్పలనాయుడు, కొప్పుల రమేష్, దండి వెంకటేష్ భువనేశ్వరి, కొప్పుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్మీడియట్ ఫలితాల్లో మెరిసిన చిన్నిపేట "వెన్నెల"



భీమునిపట్నం, ప్రజాస్వామ్యం ఆంధ్ర ప్రదేశ్ విద్యాశాఖ ఇటీవల విడుదల చేసిన ఇంటర్మీడియట్ బోర్డు ఫలితాల్లో తాళ్ళవలస పంచాయతీ లో చిన్న పేట కు చెందిన మన్యాల రాము మన్యాల జ్యోతి కుమార్తె మన్యాల వెన్నెల 1000/958 శాతం (గ్రేడ్) మార్కులతో ఉత్తీర్ణత సాధించడం తో చిన్న పేట గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. దినసరి కూలీ పనులు చేసుకునే ఓ మద్య తరగతి కుటుంబానికి చెందిన రాము తమకు అందని చదువులు తమ పిల్లలు కి అందించాలనే ఉద్దేశంతో కష్టపడి పని చేస్తూ పిల్లలు ను బాసర కళాశాల లో చేర్పించి ఉన్నత విద్య అందించారు. తల్లి తండ్రులు తమ కోసం పడే కష్టాన్ని ఇష్టం గా మార్చుకొని వెన్నెల చదువే దైవం ఆశక్తి తో పట్టుదలతో చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించడం జరిగింది. విషయం తెలుసుకున్న కుటంబ సభ్యులు వెన్నెల కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ విషయం వెన్నెల స్పందిస్తూ కష్టపడి చదివి ఉన్నత స్థాయి కి ఎదిగి తల్లిదండ్రులు ను బాగా చూసుకోవాలన్నదే నా ఆకాంక్ష అని తెలిపారు.

### విద్యుత్ సరఫరా లో నేడు అంతరాయం

ప్రజాస్వామ్యం ,విజయనగరం ఏప్రిల్ 17వ తేదీ శుక్రవారం ఉదయం 10 గంటల నుండి 11 గంటల వరకు 33/11కేవీ కలెక్టరేట్ సబ్ స్టేషన్ లో మరమ్మతులు నిర్వహించనున్న నేపథ్యంలో కలెక్టర్ ఆఫీస్, కేఎల్ పురం, పద్మావతి నగర్, రెవెన్యూ కాలనీ, సాయి కీర్తన నగర్, భవానీ నగర్, బ్రాహ్మణ వీధి, ఆర్టీవో ఆఫీస్ ఏరియా, రాజుల కాలనీ, ద్వారపూడి రోడ్డు, యాతపేట, జర్నలిస్ట్ కాలనీ, పావని నగర్, కనపాకలో కామాక్షి నగర, సాయిబాబా కాలనీ, పైడిమాంబ కాలనీ, కాలిగాట్ కాలనీ, కనపాక మహంతి వీధి, కంటోన్మెంట్లో రెల్లి వీధి, ఎస్బిటి మార్కెట్, సంజీవరావు కాలనీ, అంబేద్కర్ కాలనీ, కలెక్టర్ ఆఫీస్ జంక్షన్, అరుంధతి నగర్, మరియు కాంబో వీధి యందు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ప్రజల సహకరించాలని ఎ.పి.ఈ.పి.డి.సి.ఎల్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి త్రినాధరావు తెలిపారు

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత



భీమునిపట్నం, ప్రజాస్వామ్యం ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు గురువారం ఎంవీపీ కాలనీలోని క్యాంప్ కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ సాయాన్ని అందించారు. ఆనందపురం ఎల్.వి. పాలేనికి చెందిన దన్నాన శ్రీనుకు రూ. 3 లక్షలు, పద్మనాభం మండలం గంధవరం గ్రామానికి చెందిన పిల్లా వెంకటరమణకు రూ. 1 లక్ష, కొమ్మాదికి చెందిన బండారు సుబ్బలక్ష్మికి రూ. 70 వేలు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలను ఆర్థికంగా ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం ముందుంటుందని తెలియజేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు చిక్కాల విజయ్ బాబు, మన్యాల సోంబాబు, నాగోతి సత్యనారాయణ, లొడగల అప్పారావు, కాళ్ల సత్యనారాయణ, లొడగల వెంకట్రావు, లొడగల వెంకటరమణ, బమ్మిడి తారక్ తదితరులు పాల్గొన్నారు.

# పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీ వేగవంతం చేయాలి

### కలెక్టర్ - ఎస్.రామ సుందర్ రెడ్డి

ప్రజాస్వామ్యం /విజయనగరం: రీసర్వే పూర్తయిన, జరుగుతున్న గ్రామాల్లో మ్యుటేషన్స్, సబ్ డివిజన్స్ పూర్తిచేసి పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి రెవిన్యూ అధికారులను అదేశించారు. గురువారం మధ్యాహ్నం కలెక్టర్ కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రీ సర్వే, పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ పై



రెవిన్యూ అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జనవరి 2026 నెలలో పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ చేసిన 423 గ్రామాలలో పాసు పుస్తకాల్లో తప్పులను సరిదిద్దుటకు మ్యుటేషన్ లు, సబ్ డివిజన్, ఫారం 8 జారీ, జాయింట్ ఎల్ బి ఎం సమస్యలు పరిష్కరించి వాటన్నింటినీ సరిదిద్ది తప్పులు లేని పట్టాదారు పాస్ పుస్తకాల ముద్రణ కు పంపించాలని, పంపిణీ పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. మ్యుటేషన్స్, సబ్ డివిజన్స్ కు మే 31వ తేదీ కల్లా ఫామ్స్ పూర్తి చేసి, జూన్ 15 నాటికి పరిష్కారం చేయాలని తెలిపారు. రీ సర్వే కు లక్ష్యంగా నిర్దేశించిన ఫిబ్రవరి నెలకు కేటాయించిన 12 గ్రామాలు, మార్చి నెలకు కేటాయించిన13 గ్రామాలు, ఏప్రిల్ నెలకు కేటాయించిన 10 గ్రామాలు, మే నెలకు కేటాయించిన 9 గ్రామాలలో మ్యుటేషన్స్, సబ్ డివిజన్స్ పూర్తి చేసి నెలాఖరు నాటికి పాసుపుస్తకాలు ముద్రణకు పంపించాలని, ముద్రణ పూర్తయి వచ్చేలోగా రైతులకు బ్యాంకు రుణాలు తదితర అవసరాలకు గాను వారి ఇంటి వద్దకే వెళి1 - బి అందించాలన్నారు. వీటితోపాటు జూన్ నెలకు నిర్దేశించిన 29 గ్రామాలలో పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ కార్యక్రమాన్ని ఇచ్చిన గడువు లోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. రికార్డు లు సరిదిద్దే



అవకాశం ప్రభుత్వం కల్పించినందున రికార్డులు శుద్ధికరణ పూర్తి చేయాలన్నారు ఈ సమావేశంలో డి ఆర్ ఒ సిహెచ్. సత్తిబాబు, ఆర్ డి ఒ లు, తహసీల్దార్ లు పాల్గొన్నారు.

# ఖచ్చితమైన సమాచారంతో జన గణనను పూర్తి చేయాలి.

**జనాభా గణన విధుల్లో పాల్గొనడం దేశ సేవే సెల్ఫ్ ఎన్యుమరేషన్, -మన మిత్ర యాప్ ల పట్ల అవగాహన కల్పించాలి-జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి**

ప్రజాస్వామ్యం/వీరఘట్టం, ఏప్రిల్ 16 : జన గణన 2027 ప్రక్రియలో ఖచ్చితమైన సమాచారంతో గడువుకు ముందే విజయవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి అధికారులకు పిలుపునిచ్చారు. దేశ సేవ అంటే కేవలం బోర్డర్‌లో ఉండి తుపాకీ పట్టడమే కాదని, ఇలాంటి జాతీయ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించడం కూడా దేశ సేవ కిందకే వస్తుందని వివరించారు. ఈ శిక్షణ ద్వారా జనాభా గణనను ఖచ్చితమైన సమాచారంతో, సులభంగా పూర్తి చేయాలని ఆయన సిబ్బందిని కోరారు. ప్రతి పనిని కష్టంగా కాకుండా స్మార్ట్ గా చేయడం నేర్చుకోవాలని, సెల్ఫ్ ఎన్యుమరేషన్ ద్వారా ప్రజలే వారి వివరాలను నమోదు చేసుకునేలా మనం వారికి శిక్షణ ఇవ్వాలని సూచించారు. ఒకసారి ప్రజలకు ఇది నేర్పిస్తే, మనకు ఏ సమాచారం కావాలన్నా ఫోన్ ద్వారానే పొందవచ్చని, దీనివల్ల ప్రతిసారి వారి ఇంటికి వెళ్లాల్సిన అవసరం ఉండబోదని, సమయం ఆదా అవుతుందన్నారు. జనాభా గణనతో పాటు ప్రజలకు 'మనమిత్ర' యాప్ గురించి కూడా అవగాహన కల్పించాలని, దీని ద్వారా వారు సచివాలయానికి లేదా కలెక్టర్ ఆఫీసుకి రాకుండానే తమ పనులు మొబైల్ ద్వారా పూర్తి



చేసుకోవచ్చన్నారు. సెన్సస్ కోసం ప్రతి ఇంటికి వెళ్ళినప్పుడు, వాట్సాప్‌లో మనమిత్ర నెంబర్ సేవ్ చేయించి, దాన్ని ఎలా వాడాలో నేర్పించేందుకు ఇదొక మంచి అవకాశమని, ఇది ప్రజలకు డిజిటల్ శిక్షణ ఇచ్చినట్లు అవుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. ఇది మీ రెగ్యులర్ డ్యూటీతో పాటు అదనపు బాధ్యతని, దీనికి ప్రభుత్వం మీకు ప్రత్యేకంగా నగదు (×అఎవత్ఆజవ) కూడా చెల్లిస్తుందని గుర్తుచేసారు. దేశ భవిష్యత్తుకు అత్యంత కీలకమైన ప్రక్రియ జనాభా గణన అని, ఈసారి గణనను పూర్తిగా డిజిటల్ విధానంలో పారదర్శకంగా జరగనున్నట్లు జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. వీరఘట్టం మండల కేంద్రంలో జరిగిన ఎన్యుమరేటర్లు మరియు సూపర్‌వైజర్ల ప్రత్యేక శిక్షణా కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. గతంలో మాదిరిగా కాగితం, కలం లేకుండా ఈసారి మొబైల్ యాప్ ద్వారా డేటా సేకరించబడుతుందని, దీనివల్ల సమయం ఆదా అవ్వడమే కాకుండా, గణాంకాలు వేగంగా విశ్లేషించబడతాయన్నారు. ఈసారి ప్రజలు స్వయంగా తమ వివరాలను ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా నమోదు చేసుకునే 'సెల్ఫ్ ఎన్యుమరేషన్' ( స్వీయ గణన ) విధానాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందని, దీనిపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని ఎన్యుమరేటర్లకు సూచించారు. ప్రతి ఇంటికి వెళ్లి వివరాలను ఖచ్చితత్వంతో నమోదు చేయాలని, ఏ ఒక్కరూ కూడా గణనలో విస్మరించబడకూడదని ఆదేశించారు. యాప్ వినియోగం, డేటా ఎంట్రీలో తలెత్తే సమస్యలు, మ్యాపింగ్ మరియు లొకేషన్ వివరాల నమోదుపై సిబ్బందికి పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు. జనాభా గణన విధుల్లో పాల్గొనడం ఒక అరుదైన అవకాశమని, సిబ్బంది అందరూ బాధ్యతాయుతంగా పనిచేసి జిల్లాలో ఈ ప్రక్రియను విజయవంతం చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ శిక్షణ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్, ఇతర అధికారులు, గణంక అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఓపెన్ చేసి మొక్కజొన్న రైతులను ఆదుకోవాలి



ప్రజాస్వామ్యం/ పాచిపెంట ఏప్రిల్ 16:మొక్కజొన్న పంట ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర తో కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలి. రైతాంగానికి దళారి, ప్రైవేట్ వ్యాపారుల బారి నుండి కాపాడాలని పాచిపెంట మండలం ,గురువు నాయుడుపేట, మాతుమూరు గ్రీన్ హైవే వద్ద రైతులు ఆందోళన. రైతు సంఘం నాయకులు గెంజి వసంతరావు, నల్లి సంతోష్ కుమార్, బంటు త్రినాధ, ఈదిబిల్లి గోపి గారి ఆధ్వర్యంలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు .ఈ సందర్భంగా గంజి వసంతరావు నల్లి సంతోష్ కుమార్ మాట్లాడుతూ ఎంతో కష్టపడి ఇంటిళ్లపాది శ్రమ చేసి ఇంటికి వచ్చిన మొక్కజొన్న పంట ధర లేక ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం వలన తీవ్రంగా నష్ట పోతున్నాము. 2400 రూపాయలు మద్దతు ధర ప్రకటించినప్పటికీ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం నష్టపోతున్నామని అన్నారు. ఇప్పటికైనా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మొక్కజొన్న రైతులని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు జన్ని రామయ్య, కోరాడ ఈశ్వరరావు పాల్గొన్నరు. వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసిన రైతులు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించిన గంటా



భీమునిపట్నం, ప్రజాస్వామ్యం భీమిలి ఆర్డీఓ కార్యాలయంలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు గురువారం ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. వివిధ సమస్యలపై ప్రజలు ఆయనకు వినతి పత్రాలు అందజేశారు. 3 వ వార్డు కృష్ణా కాలనీలో బోర్ వెల్ కావాలని, ఎస్సీ కాలనీలో గ్రంథాలయం ఏర్పాటు చేయాలని స్థానికులు కోరారు. పోస్టాఫీసు సచివాలయంలోకి మార్చాలని.. గొల్లలపాలెం, కుమ్మరిపాలెంలలో రోడ్లు, డ్రెయిన్లు కావాలని విజ్ఞప్తి చేశారు. చిప్పాడలో తమకు చెందిన ఎకరం భూమిని 22 -ఎ లో పెట్టారని.. ఆ స్థలంలో దివీస్ యాజమాన్యం హైస్కూల్ నిర్మించిందని బధిరులైన సరగడ అచ్చియమ్మ, రమణమ్మ ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. సొంతిల్లు లేనందున తమకు సమీపంలోని ప్రభుత్వ భూమిలో ఇంటి స్థలం కేటాయించాలని విన్నవించారు. భీమిలి ఫుట్ బాల్ స్టేడియంలో యూజర్ ఛార్జీలు వసూలు నిలిపివేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ ఎం. విజయ్ కుమార్, ఎమ్మార్వో పి.రామారావు తదితర అధికారులు పాల్గొన్నారు.

## ప్రైవేటు స్కూల్ సైన్స్ ఉపాధ్యాయుడు అదృశ్యం



భీమునిపట్నం, ప్రజాస్వామ్యం మండలం లోని దొరతోట సమీపంలోని ప్రైవేటు స్కూల్ లో సైన్స్ ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న వంటాకు శివ (29) అదృశ్యం కావడం తో తండ్రి వంటాకు అర్జున రావు భీమిలి పోలీసులకు పిర్యాదు చేసాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం ఇంజనీరింగ్ చదివిన వంటాకు శివ గత 4 ఏళ్లుగా దొరతోట సమీపంలో ని ప్రైవేట్ స్కూల్ లో ఉపాధ్యాయుడుగా పనిచేస్తూ స్కూల్ క్వార్టర్స్ లో నివాసం ఉంటున్నాడు. ఈ నెల 5 న కొమ్మాది లో తన తమ్ముడిని కలిసిన శివ 6 న సొంత ఊరు వెళ్తున్నట్లు చెప్పాడు. ఈ నెల 6 నుండి 8 వరకు పాఠశాల కు సెలవు పెట్టిన శివ తన తల్లిదండ్రులు నివసిస్తున్న విజయనగరం జిల్లా, జగ్గయ్యపేట స్వంత ఊరు వెళ్ళవలసి ఉన్నప్పటికీ అక్కడకు వెళ్ళలేదు. తనదగ్గర కు రాకపోవడం, అటు పాఠశాల లో లేకపోవడం తో కుమారుడి ఆచూకీ కోసం తండ్రి అర్జున్ రావు గాలించాడు. ఫలితం లేకపోవడం తో 16 వ తేదీ గురువారం భీమిలి పోలీసులకు పిర్యాదు చేసాడు. తండ్రి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# మన్యం మెగా కోలాటం సమన్వయంతో విజయవంతం చేయాలి

**6 వేల మంది విద్యార్థులతో అఖండ కోలాటం-చిన్న పొరపాటుకి తావులేకుండా పక్కా ఏర్పాట్లు-చరిత్ర సృష్టించే మహాఘట్ట ఏర్పాట్లపై సమీక్షించిన జేసీ**

ప్రజాస్వామ్యం/పార్వతీపురం, ఏప్రిల్ 16 : జిల్లా కేంద్రంలో ఈ నెల 22వ తేదీన నిర్వహించనున్న ప్రతిష్టాత్మక మన్యం మెగా కోలాటం కార్యక్రమాన్ని అధికారులందరూ సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్ లక్ష్యంగా 6 వేల మంది విద్యార్థులతో నిర్వహించే ఈ అఖండ కోలాటంలో చిన్న తప్పుకి తావులేకుండా పటిష్ట ఏర్పాట్లు చేయాలని అన్నారు. చరిత్ర సృష్టించే మహాఘట్టమైన మన్యం మెగా కోలాటం కార్యక్రమ నిర్వహణ ఏర్పాట్లపై జాయింట్ కలెక్టర్ గురువారం జిల్లా అధికారులతో సమీక్షా సమావేశాన్ని కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించారు. లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్ లక్ష్యంగా సుమారు 6000 మంది విద్యార్థులతో నిర్వహించే ఈ భారీ కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జె.సి మాట్లాడుతూ, ఆర్టీసీ బస్టాండ్ నుండి టౌన్ పోలీస్ స్టేషన్ వరకు ప్రధాన రహదారిపై జరిగే ఈ ప్రదర్శనలో ఎటువంటి ఆటంకాలు కలగకుండా చూడాలన్నారు. అధికారులకు కేటాయించిన విధులను నిబద్ధతతో బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. పోలీస్ యంత్రాంగం సమన్వయంతో ట్రాఫిక్ మళ్లింపు, అత్యవసర సేవల కోసం ప్రత్యేక మార్గాలను ఏర్పాటు చేయాలని సూచించారు. స్టేజ్ ఏర్పాట్లు, బారికేడింగ్, తాగునీరు, మరుగుదొడ్లు మరియు విద్యార్థులకు అవసరమైన అల్పాహారం,




భోజన వసతులలో ఎటువంటి లోటుపాట్లు ఉండకూడదని స్పష్టం చేశారు. కార్యక్రమ సౌకర్యార్థం 12 జోన్లగా ఏర్పాటుచేయడం జరిగిందని, ప్రతి జోన్‌లో మెడికల్ క్యాంపులు, అంబులెన్స్ సేవలు అందుబాటులో ఉంచాలని వైద్య ఆరోగ్య శాఖను ఆదేశించారు. కోలాటం నృత్యం చేసే విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకూడదని, అన్ని ఏర్పాట్లు పక్కాగా వుండాలని అన్నారు. లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్ నిబంధనల ప్రకారం డ్రోన్ కవరేజ్, నిరంతర వీడియో రికార్డింగ్ మరియు సాక్షుల ధృవీకరణ పత్రాలను పక్కాగా సిద్ధం చేయాలన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి మరియు ఇతర నోడల్ అధికారులు క్షేత్రస్థాయిలో సమన్వయం చేసుకుంటూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. విధుల్లో అలసత్వం వహిస్తే సహించేది లేదని, ప్రతి అధికారి, జోనల్ అధికారులు తమకు కేటాయించిన బాధ్యతలను జవాబుదారీతనంతో నిర్వహించాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత, సబ్ కలెక్టర్ ఆర్.వైశాలి, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గ్రామీణ పరివర్తన ప్రణాళిక సమావేశం




ప్రజాస్వామ్యం/ పాచిపెంట ఏప్రిల్ 16:పాచిపెంట మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ కార్యాలయము లో మండల వ్యవసాయ గ్రామీణ పరివర్తన ప్రణాళిక సమావేశంనిర్వహించబడిందిఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సాలూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీ ముఖి సూర్యనారాయణ గారు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు అధిక లాభాలు పొందేందుకు పామాయిల్ సాగు వైపు మరింతగా మళ్లాలని సూచించారు. పామాయిల్ ద్వారా మంచి ఆదాయం లభిస్తున్నందున, మండలంలో సాధ్యమైనంత మేరకు రైతులు ఈ పంటను పెంచాలని కోరారుఅదే విధంగా, చిరుధాన్యాల సాగును కూడా విస్తరించాలని, తంగలం, మూటకూడు, శతాబి, గరిస గుడ్డి వంటి ప్రాంతాల్లో కాఫీ సాగును ప్రోత్సహించి రైతులు అధిక లాభాలు పొందాలని సూచించారువ్యవసాయంలో యాంత్రికరణ వినియోగం పెంచడం ద్వారా కూలీల ఖర్చు తగ్గించి లాభాలు పెంచుకోవచ్చని తెలిపారు. ఈ సంవత్సరం ఎల్ నినో ప్రభావం దృష్ట్యా రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లి, సకాలంలో పద్ధతులను అనుసరించి మంచి ఫలితాలు సాధించాలని సూచించారురాబోయే ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో పెట్టుకుని రైతులు ముందుగానే తమ పొలాల్లో పిఎండిఎస్ విత్తనాలు చల్లి భూసారాన్ని పెంచుకోవాలని సూచించారుఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శ్రీమతి అనురాధ పండా గారు, మండల పశువైద్యాధికారి, మతల బలరాం, పూసర్ల నర్సింగ్ రావు, బాబ్జి, సత్యనారాయణ, మరియు గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

# రీ-సర్వే పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవు


**జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి హెచ్చరిక**




ప్రజాస్వామ్యం/పార్వతీపురం, ఏప్రిల్ 16 : జిల్లాలో జరుగుతున్న ప్రతిష్టాత్మక రీ-సర్వే ప్రక్రియను అత్యంత పారదర్శకతతో, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. వెరిఫికేషన్ ప్రక్రియలో ఎటువంటి తప్పులు జరగడానికి వీలు లేదని, ఒకవేళ ఏవైనా పొరపాట్లు జరిగితే, దానికి సంబంధిత అధికారులే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. అధికారులకు వెరిఫికేషన్ ప్రక్రియపై ఏవైనా సందేహాలు ఉన్నా లేదా అవగాహన లోపం ఉన్నా, వెంటనే వాటిని నివృత్తి చేసుకోవాల్సిన బాధ్యత మీపైనే ఉందన్నారు. ఎటువంటి సందేహం ఉన్నా నిస్సంకోచంగా తహశీల్దార్ లేదా ఆ పై అధికారులను సంప్రదించవచ్చని జేసీ స్పష్టం చేశారు. ప్రతి అంశంపై స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడం జరుగుతోందని, ఎటువంటి అస్పష్టతకు తావులేకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. పనిలో నిర్లక్ష్యం వహించి, వెరిఫికేషన్ లో తప్పులు చేస్తే ఊపేక్షించేది లేదని, నిబంధనల ప్రకారం కఠినంగా వ్యవహరించడం జరుగుతుందని జేసీ తేల్చిచెప్పారు. గురువారం కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో రీ-సర్వే పురోగతి, మ్యుటేషన్ల పెండింగ్ అంశాలపై జేసీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 3వ విడత రీసర్వే పూర్తిచేసి, తుది =ూ= వచ్చిన పిదపే 4వ విడత రీసర్వే పనులు చేపట్టాలని ఆదేశించారు. అందులో ఏ గ్రామానికి ఱూ= ముందుగా ఇవ్వగలరో, అటువంటి వాటిపై దృష్టి సారించాలని అన్నారు. విఆర్ఓ లాగిన్‌లో పెండింగ్‌లో ఉన్న మ్యుటేషన్లను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయి రికార్డులకు, ఆన్‌లైన్ డేటాకు మధ్య వ్యత్యాసం లేకుండా చూడాలని సూచించారు. వెరిఫికేషన్ ప్రక్రియను తదుపరి స్థాయికి తీసుకెళ్లాలని తహశీల్దార్లకు, ఆర్ఐ లకు గడువు విధించారు. ప్రతి రీ-సర్వే గ్రామానికి ఒక అంకితభావం కలిగిన విఆర్ఓ ఉండేలా చూడాలని, గ్రౌండ్ వాలిడేషన్ నుండి మ్యుటేషన్ల ఫైల్స్ బిల్డప్ వరకు ఎక్కడా ఆలస్యం జరగకూడదని ఆదేశించారు.







# ఫస్ట్ పార్ట్ రిలీజ్ అయిన కొన్ని నెలలకే సెకండ్ పార్ట్ రిలీజ్ చేసిన సినిమాలివే!

తాజాగా రన్వీర్ సింగ్ సినిమాతో ఈ చర్చ మళ్ళీ మొదలైంది. తక్కువ వ్యవధిలో వచ్చిన ఆ క్రేజీ సీక్వెల్స్ విశేషాలు మీకోసం.సాధారణంగా ఏదైనా సూపర్ హిట్ సినిమాకు సీక్వెల్ రావాలంటే ఏళ్ల తరబడి వేచి చూడాలి. 'బాహుబలి' అయినా, 'పుష్ప' అయినా పార్ట్-2 కోసం ఫ్యాన్స్‌కు ఎదురుచూపులు తప్పవు. కానీ, కొందరు దర్శకులు మాత్రం కథపై ఉన్న నమ్మకంతో మొదటి భాగం రిలీజ్ అయిన కొద్ది నెలల గ్యాప్‌లోనే రెండో భాగాన్ని కూడా థియేటర్లలోకి తెచ్చేస్తుంటారు. తాజాగా రన్వీర్ సింగ్ సినిమాతో ఈ చర్చ మళ్ళీ మొదలైంది. తక్కువ వ్యవధిలో వచ్చిన ఆ క్రేజీ సీక్వెల్స్ విశేషాలు మీకోసం..బంవవర్మ మార్క్ 'రక్త చరిత్ర'సినిమాను రెండు భాగాలుగా రిలీజ్ చేసే ట్రెండ్‌ను టాలీవుడ్‌లో గట్టిగా మొదలుపెట్టింది దర్శకుడు రామ్ గోపాల్ వర్మ అని చెప్పాలి. పరిటాల రవి జీవిత కథ ఆధారంగా వివేక్ ఒబెరాయ్ హీరోగా వచ్చిన 'రక్త చరిత్ర' మొదటి భాగం అక్టోబర్ 22, 2010న విడుదలై సెన్సేషన్ క్రియేట్ చేసింది. ఇక సరిగ్గా నెలన్నర తిరగకముందే, అంటే డిసెంబర్ 3న రెండో భాగాన్ని కూడా రిలీజ్ చేసి వర్మ అందరినీ ఆశ్చర్యపరిచారు. కథలోని వేగం తగ్గకుండా ఉండాలనే ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారుఎన్టీఆర్ బయోపిక్ మ్యాజిక్:నందమూరి తారక రామారావు గారి జీవిత చరిత్రను వెండితెరపై ఆవిష్కరించే క్రమంలో బాలకృష్ణ రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు వచ్చారు. క్రిష్ దర్శకత్వంలో రూపొందిన 'ఎన్టీఆర్ కథానాయకుడు' సంక్రాంతి కానుకగా జనవరి 9, 2019న విడుదలైంది. ఇక ఎన్టీఆర్ రాజకీయ ప్రస్థానాన్ని చూపించే రెండో భాగం 'ఎన్టీఆర్ మహానాయకుడు' కేవలం 45 రోజుల గ్యాప్‌తో ఫిబ్రవరి 22నే థియేటర్లలోకి వచ్చేసింది. ఇంత తక్కువ సమయంలో రెండు భాగాలు రావడం టాలీవుడ్‌లో ఒక రికార్డ్‌బాలీవుడ్ సెన్సేషన్ 'దురంధర్'ఇక రీసెంట్‌గా బాలీవుడ్ బాక్సాఫీస్‌ను షేక్ చేసిన సినిమా 'దురంధర్'. రన్వీర్ సింగ్ హీరోగా ఆదిత్య ధర్ తెరకెక్కించిన ఈ చిత్రం మొదటి భాగం గతేడాది డిసెంబర్ 5న విడుదలై బ్లాక్ బస్టర్ హిట్ అందుకుంది. ఆ వేడి తగ్గకముందే 'దురంధర్- ది రివెంజ్' పేరుతో రెండో భాగాన్ని కేవలం మూడున్నర నెలల గ్యాప్‌తో ఈ ఏడాది మార్చి 19, 2026న విడుదల చేశారు. ఒక భారీ యాక్షన్ సినిమాకు ఇంత తక్కువ టైమ్‌లో సీక్వెల్ రావడం బాలీవుడ్ వర్గాల్లో పెద్ద చర్చకు దారితీసిందివాస్సేపూర్ గ్యాంగ్స్ అరాచకంరియలిస్టిక్ క్రైమ్ డ్రామాలకు కేరాఫ్ అడ్రస్ అయిన అనురాగ్ కశ్యప్, 'గ్యాంగ్స్ ఆఫ్ వాస్సేపూర్' సినిమాతో ఇండియన్ సినిమాను ఒక ఊపు ఊపేశారు. ఈ సినిమా మొదటి భాగం జూన్ 22, 2012న రిలీజ్ కాగా, కేవలం రెండు నెలల లోపే ఆగస్టు 8న పార్ట్-2ను రిలీజ్ చేశారు. ఇక అసలు కథలో ఉన్న ఇంటెన్సిటీని ప్రేక్షకులు మర్చిపోకముందే రెండో భాగాన్ని చూపించి దర్శకుడు సక్సెస్ అయ్యారు. ఇలాంటి ప్లానింగ్ వల్ల సినిమాపై ఉన్న ఆసక్తి తగ్గకుండా ఉండటం చిత్ర యూనిట్‌కు పెద్ద ప్లస్ అవుతుంది అనటం లో ఎటువండి సందేహం లేదు.

# యానిమల్‌కి మించి స్పిరిట్‌లో ఆ సీన్స్?



రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ, షాలిని పాండే జంటగా సందీప్ రెడ్డి వంగ రూపొందించిన సెన్సేషనల్ బ్లాక్ బస్టర్ మూవీ -అర్జున్‌రెడ్డి-. ఈ సినిమాలో లిప్ లాక్ సీన్‌లపై వివాదం చెలరేగడం తెలిసిందే. అ తరువాత కూడా ఇందులోని ఇంటిమసీ సీన్‌లపై కూడా విమర్శలొచ్చాయి. అయినా సరే సినిమా బాక్సాఫీస్ వద్ద పాథ్ బ్రేకింగ్ బ్లాక్ బస్టర్‌గా నిలిచి సంచలనం సృష్టించింది. హీరోగా విజయ్ దేవరకొండకు తిరుగులేని గుర్తింపుని తెచ్చి పెట్టింది. దర్శకుడిగా సందీప్‌రెడ్డి వంగకు కల్ట్ మూవీస్ డైరెక్టర్‌గా పాపులారిటీని అందించిందిఈ సినిమాతో బాలీవుడ్‌కు వెళ్లిన సందీప్ దీన్నే అక్కడ -కబీర్‌సింగ్- పేరుతో చేసి అక్కడ కూడా బ్లాక్ బస్టర్ హిట్‌తో పాటు కాంట్రవర్సీలని కూడా ఎదుర్కోవడం తెలిసిందే. దీని తరువాత రణ్‌బీర్ కపూర్ కథానాయకుడిగా చేసిన మూవీ -యనిమల్-, రష్మిక మందన్న హీరోయిన్‌గా నటించిన ఈ సినిమా తండ్రీ కొడుకుల ఎమోషనల్ జర్నీ, తండ్రి కోసం పంతం పట్టిన ఎంత వరకైనా వెళ్లే కొడుకు స్టోరీగా దీన్ని సందీప్ తెరకెక్కించాడు. అయితే ఇందులో రష్మికతో పాటు త్రిప్తి దిమ్రీతో రణ్‌వీర్ చేసిన ఇంటమసీ సీన్‌లపై, రణ్‌బీర్ ఎక్స్‌ప్రెషన్స్‌పై కూడా విమర్శలొచ్చాయిసందీప్ తన సినిమాల్లో లేడీస్‌ని కించపరుస్తున్నాడని పలువురు విమర్శలు గుప్పించారు. దీనిపై సందీప్ కూడా ఘాటుగానే స్పందించడంతో -యనమల్- మూవీ నేషనల్ వైడ్‌గా ట్రెండ్ అయింది. ప్రస్తుతం సందీప్ పాన్ ఇండియా స్టార్ ప్రభాస్‌తో -స్పిరిట్- మూవీని రూపొందిస్తున్నాడు. త్రిప్తి దిమ్రి హీరోయిన్‌గా నటిస్తున్న ఈ మూవీకి సంబంధించిన షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఇందులో ప్రభాస్ పవర్ ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా కనిపించనున్నాడుకీలకమైన విలన్ క్యారెక్టర్‌లో వివేక్ ఓబెరాయ్ నటిస్తుండగా, మరో కీలక క్యారెక్టర్‌లో ప్రకాష్ రాజ్ కనిపించనున్నారు. ఇదిలా ఉంటే -అర్జున్‌రెడ్డి, యానిమల్ సినిమాల్లోని ఇంటిమసీ సీన్‌లతో హాట్ టాపిక్‌గా మారిన సందీప్ రెడ్డి వంగ మరి -స్పిరిట్-లోనూ అలాంటి సీన్‌లని కంటిన్యూ చేస్తున్నాడా? అనే చర్చ జరుగుతోంది. అయితే త్రిప్తి దిమ్రీని ఆ కారణం వల్లే హీరోయిన్‌గా తీసుకున్నాడని, యానిమల్‌కి మించి ఇంటిమసీ సీన్‌లు ఇందులో ఉంటాయని ఇన్ సైడ్ టాక్‌రెగ్యులర్ టెంప్లెట్ స్టోరీ టెల్లింగ్‌కి పూర్తి అవేగా కథలని చెప్పడంతో దిట్టగా పేరు తెచ్చుకున్న సందీప్ రెడ్డి వంగ -స్పిరిట్-లోనూ మరింత తీవ్రమైన భావోద్వేగాలని ఆవిష్కరిస్తున్నారట. అంతే కాకుండా ఇంటిమసీ సీన్‌లకు కేరాఫ్ అడ్రస్‌గా మారిన వంగ ఈ మూవీలోనే అంతకు మించి అనే స్థాయిలో ఇంటిమసీ సీన్‌లని డిజైన్ చేసినట్టుగా చెబుతున్నారు. ప్రభాస్, త్రిప్తి దిమ్రీలపై వచ్చే సీన్‌లు ఫ్యాన్స్ చేత థియేటర్లలో కేకలు పెట్టిస్థాయని తెలుస్తోంది. ప్రభాస్ -రాధేశ్యామ్-లో పూజా హెగ్డేతో ఓ ఇంటమసీ సీన్‌లు చేశారు. దానికి మించి వంగ మార్కు సీన్‌లు -స్పిరిట్-లో ఉంటాయని, ప్రభాస్ నుంచి ఊహించని సీన్‌లని ఇందులో చూపించి సందీప్ రెడ్డి వంగ షాక్ ఇవ్వబోతున్నాడని ఇన్ సైడ్ టాక్.

# శివ కార్తికేయన్ రూ.50 లక్షల స్టోరీ!

కోలీవుడ్ స్టార్ హీరో శివ కార్తికేయన్ కున్న ప్రత్యేకతే వేరు. కోలీవుడ్ హీరోల్లో తమిళనాడు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావించే కలైమామని పురస్కారాన్ని సొంతం చేసుకుని అందరిని ఆశ్చర్యపరిచిన శివ కార్తికేయన్ చిన్న స్థాయి నుంచి కెరీర్ ప్రారంభించి ఇప్పుడు హీరోగా, నిర్మాతగా అద్భుతమైన విజయాల్ని సొంతం చేసుకుంటూ తమిళనాట మంచి పాపులారిటీని సొంతం చేసుకుంటున్నారు. ప్రస్తుతం నాజ్ కమల్ ఇంటర్నేషనల్ బ్యానర్‌పై కమల్ హాసన్ నిర్మిస్తున్న -సేయోన్- మూవీలో నటిస్తున్నారసుబ్రహ్మణ్య స్వామి స్టోరీ నేపథ్యంలో సాగే డివోషనల్, యాక్షన్ డ్రామాగా దీన్ని రూపొందిస్తున్నారు. శివ కుమార్ మురుగేషన్ ఈ మూవీతో దర్శకుడిగా పరిచయం . ఇదిలా ఉంటే శివ కార్తికేయన్ గొప్పతనం గురించి నటుడు ప్రేమ్ కుమార్ చెప్పిన స్టోరీ ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. శివ కార్తికేయన్‌తో తనకున్న భావోద్వేగభరిత అను బంధాన్ని ఈ సందర్భంగా వెల్లడించడమే కాకుండా రూ.50 లక్షలకు సంబంధించిన ఇంట్రెస్టింగ్ స్టోరీని బయటపెట్టారుదీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారి ట్రెండ్ అవుతోంది





# అందాలతో అలరిస్తున్న ప్రియా ప్రకాష్

ఒక్క కన్నుగీటుతో యావత్ దేశాన్ని తన మాయలో పడేసుకున్న మలయాళ కుట్టి ప్రియా ప్రకాశ్ వారియర్, మరోసారి తన అందచందాలతో సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. తెలుగులో ఆశించిన స్థాయిలో హిట్లు రాకపోయినా, ఈ బ్యూటీ క్రేజ్ మాత్రం తగ్గలేదు. తాజాగా ట్రెడిషనల్ డ్రెస్ లో అదిరిపోయే ఫోటోషూట్‌తో కుర్రకారు గుండెల్లో సెగలు పుట్టిస్తోంది. సినిమాల కంటే సోషల్ మీడియాలోనే ఈ భామ హవా ఎక్కువగా నడుస్తోంది. ఆ విశేషాలు మీకోసం..సోషల్ మీడియాలో సెగలు పుట్టిస్తున్న కేరళ కుట్టి:ప్రియా ప్రకాశ్ వారియర్ పేరు వినగానే అందరికీ గుర్తొచ్చేది ఆమె కన్నుగీటే సీన్. 'ఓరు ఆదర్ లవ్' సినిమాతో ఓవర్‌నైట్ సెలబ్రిటీగా మారిపోయిన ఈ అమ్మడు, అప్పటి నుండి ఇప్పటిదాకా వార్తల్లో నిలుస్తూనే ఉంది. తాజాగా ఈ కేరళ బ్యూటీ పక్కా ట్రెడిషనల్ లుక్‌లో దర్శనమిచ్చింది. లంగా ఓణి ధరించి తనదైన శైలిలో అందాలను ఆరబోస్తూ దిగిన ఫోటోలు ఇప్పుడు నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి. ఈ ఫోటోలు చూసిన నెటిజన్లు "ప్రియా మళ్ళీ మాయ చేస్తోంది" అంటూ క్రేజీ కామెంట్స్ చేస్తున్నారుతెలుగులో అందని అదృష్టం:వైరల్ వీడియో తెచ్చిన క్రేజ్‌తో ప్రియాకు టాలీవుడ్‌లో మంచి అవకాశాలే వచ్చాయి. నితిన్‌తో కలిసి 'చెక్' సినిమాలో నటించి మెప్పించినప్పటికీ, ఆ సిమా బాక్సాఫీస్ వద్ద విజయం సాధించలేకపోయింది. ఆ తర్వాత చాలా గ్యాప్ తీసుకుని మెగా మల్టీస్టారర్ మూవీ 'బ్రో'లో కీలక పాత్ర పోషించింది. అయితే ఆ సినిమా కూడా డిజాస్టర్ కావడంతో టాలీవుడ్‌లో ప్రియాకు ఐరన్ లెగ్ అనే ముద్ర వచ్చిపడింది. దీంతో ప్రస్తుతం తెలుగులో ఈమెకు కొత్త అవకాశాలు రావడం కాస్త కష్టంగానే మారిందితమిళ, కన్నడ సినిమాల్లో బిజీ:తెలుగులో లక్ కలిసి రాకపోయినా, ఇతర భాషల్లో మాత్రం ప్రియా అదృష్టాన్ని పరీక్షించుకుంటోంది. ఇటీవల తమిళ స్టార్ హీరో అజిత్ కుమార్ సరసన గుడ్ బ్యాడ్ అగ్లీ చిత్రంలో నటించి అందరి దృష్టిని ఆకర్షించింది. కోలీవుడ్‌లో ఈ సినిమా తన కెరీర్‌కు మంచి బ్రేక్ ఇస్తుందని ఆమె ఆశిస్తోంది. అలాగే కన్నడలో విష్ణు ప్రియ, బాలీవుడ్‌లో త్రీ మంకీస్, లవ్ హ్యాకర్స్ వంటి క్రేజీ ప్రాజెక్టులతో ఈ మలయాళ భామ బిజీగా గడుపుతోందిసోషల్ మీడియాలో అసలైన హవా:సినిమా ఫలితాలతో సంబంధం లేకుండా ప్రియా సోషల్ మీడియాలో మాత్రం నిత్యం యాక్టివ్‌గా ఉంటుంది. తన డ్యాన్స్ వీడియోలు, గ్లామరస్ ఫోటోషూట్‌లతో అభిమానులకు టచ్‌లో ఉంటుంది. తెలుగులో సరైన హిట్ పడితే మళ్ళీ ఇక్కడ పాగా వేయాలని ఈ కన్నుగీటు సుందరి ప్లాన్ చేస్తోంది. అందం, అభినయం ఉన్నా అదృష్టం కలిసి రాక ఇబ్బంది పడుతున్న ప్రియాకు ఈ కొత్త ఫోటోషూట్ ఏమైనా అవకాశాలు తెచ్చిపెడుతుందేమో చూడాలి. ఏదేమైనా తన అందాలతో కుర్రకారును అలరించడంలో ప్రియా ఎప్పుడూ ముందే ఉంటుంది!

EDITED PRINTED, PUBLISHED AND OWNED BY M. SIVAKUMAR, PRAJA SWAMYAM TELUGU DAILY, PLOT NO 138 PAVANI NAGAR, CANTONMENT, VIZIANAGARAM-535003. (AP) PRINTED AT JAYAM GRAPHICS, OFF-SET-PRINTERS, PLOT NO. 138, PAVANI NAGAR, CANTONMENT. VIZIANAGARAM 535003, (AP) Cell 97032 07611, E-mail pldnewsvzm@gmail.com. RNI No. APTEL/2008/24928 Poster Regd. No. VZM/22/2020-2022